# పునర్జన్మ

బి.సరస్వతి



మురళి వస్తున్నాడు.

కాన్పూరులో ఎం. టెక్. పూర్తిచేసి ఇంటికి వచ్చేస్తున్నాడు.

ఇన్నేళ్లూ చదువు వంకతో మురళిని వీలైనంత ఎక్కువ కాలం ఇంటికి దూరంగా ఉంచగలిగేను. ఇప్పుడింక ఏ మిషతోనూ మురళిని దూరంగా పంపలేను. మురళి ఇక్కడే ఉద్యోగం చూసుకొని స్థిరపడాలని రాధ కోరిక. ఇదివరకే మురళిని ఒప్పించి వాగ్దానం చేయించుకుంది. చిత్రమేమిటంటే మురళి దూరంగా ఉన్నప్పుడు చూడాలని తహతహ లాడేవాడిని. ఇంటికి వస్తే ఎప్పుడు వెళ్ళిపోతాడా అని ఎదురుచూసేవాడిని. ఏమిటో నిలకడలేని మనస్సు! అందుకే అంటారు మనస్సు కోతిలాంటిదని!

నిజానికి ఒక్కగా నొక్క కొడుకు వృద్ధాప్యంలో కళ్ల కెదురుగా ఉండాలని ఎవరైనా కోరుకుంటారు. కాని నేను మురళిని రోజూ చూస్తూ వ్యథ భరించలేను. అందుకే ఉత్తరం వచ్చినప్పటి నించి నాకు చాలా అశాంతిగా ఆందోళనగా ఉంది.

నే నిలాగ జీవితాంతం అశాంతితో కుమిలిపోవలసిందేనా! ఏ అద్భుతమో జరిగి నాకు మనశ్శాంతి కలిగితే ఎంత బాగుండును!

* * *

అడ్వొకేటుగా ప్రాక్టీసుపెట్టిన కొద్ది కాలానికే పుష్కలంగా డబ్బును, పేరును ఆర్జించసాగేను. బి.ఎ. ప్యాసయిన అందమైన రాధను ఏరి కోరి పెళ్లి చేసుకున్నాను. ప్రతి వేసవిలో ఊళ్లకు వెళ్తూ ఎంతో హాయిగా ఉండేవాళ్లం. ఐదేళ్లు ఐదు క్షణాలలాగా గడిచిపోయాయి. ఇంట్లో ఉయ్యాలవేసే అవ



ఒప్పించి వచ్చింది. ఇప్పటినించే పెంచుకుంటే మీరే తల్లిదండ్రులు అనుకొని అభిమానంగా ఉంటాడు. మూడో నెల రాగానే దత్తతచేసుకొని దానికేమైనా ఇవ్వండి. పిచ్చిపిల్ల సంతోషిస్తుంది. కన్నబిడ్డను త్యాగం చెయ్యడమంటే మాటలుకాదు. ఏమిచ్చినా ఋణం తీరదు," మా అత్తగారి వాక్ప్రవాహం ఆగింది. నాకు భగ్గుమంది.

"తీర్చలేని ఋణాలు మా కొద్దులెండి," అనేసి విసురుగా బయటకు నడిచాను. మనస్సు చికాకుగా అయిపోయింది. నా డబ్బుచూసి, నే నడగకుండానే ఎవరికి వారే పెంపకాని కిస్తామంటూ పోటీపడుతున్నారు. పెంపకానికి తీసుకుంటే తామేదో గొప్ప త్యాగంచేసి మాకు పున్నామనరకం తప్పించి ఉద్ధరించినట్లు పోజుపెట్టి డబ్బు గుంజటానికి చూస్తారు.

నా తోబుట్టువు బిడ్డను తెచ్చుకుంటే రాధ పుట్టింటివారి కందరికీ కోపాలొస్తాయి. రాధతరపు పిల్లవాడిని తెచ్చుకుంటే నా వాళ్లందరూ కినుకవహిస్తారు. ఇద్దర్నీ కాదని ఏ అనాధపాపనో తెచ్చు

కుంటే అంధరూ కత్తిగడతారు. అందుకే కనీసం కొన్నేళ్ళవరకైనా దత్తత ప్రసక్తి పెట్టుకోకూడదని నిశ్చయించు కున్నాను.

* * *

చల్లని వెన్నెల్లో తెల్లని పక్కమీద పడుకున్న నేను హఠాత్తుగా ఏదో అను మానం రాగానే మనస్సులోనే ఉలిక్కి పడ్డాను. తెల్లవారేసరికి ఆ అనుమానమే పెనుభూతమై నన్ను డాక్టరు శ్రీహరి రావుగారి దగ్గిరకి పరుగులెట్టించింది.

శ్రీహరిరావుగారితో నాకు స్నేహం ఉంది. ఆయన నిదానంగా అన్ని పరీక్షలు చేసి చెప్పిన కఠోరసత్యం నాలో అంత వరకు ఉన్న ఆశను కూలద్రోసి క్రుంగ దీసింది.

"కృష్ణగారూ! బాధపడకండి. మీ భార్యనుకూడ తీసుకొని రండి. మీ సమ స్యను పరిష్కరించడానికి ప్రయత్ని స్తాను," అన్నారు శ్రీహరిరావుగారు.

* * *

"ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్‌ద్వారా మీరు సంతానాన్ని పొందవచ్చు కృష్ణ గారూ! ఇందువలన బంధువులతో విరోధం వచ్చే ప్రమాదం ఉండదు. మీకూ స్వంతంగా బిడ్డను కని పెంచిన అనుభూతి కలుగుతుంది." శ్రీహరిరావు గారన్నారు.

నేను అప్రయత్నంగా రాధవంక చూశాను. ఆమెకళ్లు ఒప్పుకోమని అశగా అభ్యర్థిస్తున్నాయి. బిడ్డకోసం రాధపడే ఆరాటాన్ని కాదనగల శక్తి నాకు లేదు. భగవాన్! నా కేమిటీ రంపపుకోత!

శ్రీహరిరావుగారు కుర్చీలోంచి లేచి నావైపువచ్చి స్నేహపూర్వకంగా భుజం తట్టారు.

"ఆలోచించండి కృష్ణగారూ! ఈ విషయం పైవారికి తెలియగల అవకాశం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాను. మీరు సమాధాన పడగలిగితే ఇది చాల మంచి పద్ధతి," అన్నారు

"మళ్లీ కలుస్తాను," అని చెప్పేసి రాధను తీసుకొని బైటకు నడిచాను.

మౌనంగా కారు నడుపుతున్నాను.

"ఏమండీ!" నేను రాధవైపు చూశాను.

"నేను నోరువిప్పి అడగకుండానే ఎన్నో కోరికలు తీర్చేరు. మొదటి సారిగా కోరుకుంటున్న నా కోరికను తీర్చరూ! నన్ను అమ్మను చెయ్యరూ!"

"అయ్యో రాధా! నిన్ను అమ్మను చేసేది నేను కాదు. అజ్ఞాత వ్యక్తి ఎవరో!" అంటూ నా మనస్సు ఆక్రో శించింది.

"నన్ను ఆలోచించుకోనియ్యి రాధా! తొందరపెట్టకు," అన్నాను డ్రైవింగు మీద దృష్టిని కేంద్రీకరిస్తూ. రాధ మరి మాట్లాడలేదు.

నా రక్తం పంచుకోని బిడ్డ రాధ గర్భంలో పెరుగుతుందంటే నా కేమిటో

లాగా ఉంది. అలాగని రాధ కోరికను కాదనలేను. ఆలోచనలతో సతమత మౌతూ రెండు రోజులు మౌనంగా గడిపివేశాను.

ఆ రోజు నేను కోర్టుకు వెళ్లడానికి తయారవుతూంటే రాధ గదిలోకి వచ్చింది.

"కోరరాని కోరిక కోరి మిమ్మల్ని నొప్పించేను. నన్ను క్షమించండి. మీరు ముభావంగా ఉంటే నేను భరించ లేను. మామూలుగా మాట్లాడండి," అంది. ఆమె గొంతు దుఃఖాన్ని అణచు కుంటున్నట్లుంది. నాకు జాలివేసింది. అప్రయత్నంగా రాధను దగ్గరకు తీసుకున్నాను.

"నీది ప్రకృతి సహజమైన కోరిక రాధా! కోరరానిది కాదు. రేపే శ్రీహరి రావుగారి దగ్గరకి వెళ్దాం," అన్నాను కన్నీళ్లు తుడుస్తూ. రాధ ముఖం వెలిగి పోయింది.

* * *

రాధ గర్భవతి అయిందని తెలిసి మా అమ్మ, అత్తగారు హడావిడిగా వచ్చారు. సీమంతం, పువ్వుల ముడుపు చేస్తామంటే వద్దని రాధ వారించింది. అయినా వాళ్లు "ఎప్పటి వేడుక అప్పుడు జరగాలి," అంటూ ఒక మంచిరోజున రాధకు తలంటు పోసి పువ్వులజడ కుట్టి క్రొత్త పట్టుచీర కట్టబెట్టి చేతులనిండుగా రంగురంగుల గాజులు తొడిగి ముచ్చట తీర్చుకున్నారు. రాధ ఎంత అందంగానో కనబడేది.

పరాయి మగవాడి నీడకూడా సోకని మహా ఇల్లాలు రాధ! కాని ఆమె గర్భంలో పెరిగే బిడ్డ నాది కాదన్న చేదునిజం రాధను దగ్గరకు తీసుకోవా లన్న నా ఆరాటాన్ని ఎప్పటికప్పుడు అణచివేస్తూ ఉండేది.

* * *

శ్రీహరిరావుగారి హాస్పిటల్‌లో రాధ బాబును ప్రసవించింది. ఆయన స్వయంగా ఫోన్‌లో కబురు చెప్పగానే నేను వెళ్లి రాధను, బాబును చూశాను. బాబు ముద్దుగా అందంగా ఉన్నాడు. అలసటతోపాటు రాధ కళ్లలో సంతృప్తి కొట్టవచ్చినట్లు కనబడింది.

బాబుకు 'మురళి' అని పేరు పెట్టింది రాధ. వాడి సంరక్షణలో, ముద్దు ముచ్చట్లలో పడిపోయిన రాధ నా గురించి పట్టించుకోవడం బాగా తగ్గించింది. ఎంత పని ఒత్తిడిఉన్నా నా అవసరాలన్నీ నేనే చూసుకోవలసి రావటం చాలా చికాకుగా ఉండేది.

"లోకంలో నువ్వొక్కర్తివే తల్లి వైనట్లు ఎందుకంత ఆర్భాటం రాధా? నా అవసరాలు గమనించవలసిన బాధ్యత లేదా?" అని కేకలు వేసేవాడిని.

"వస్తున్నానండీ," అంటూ పరుగులు పెడుతూ వచ్చి రాధ అవీ ఇవీ అందిస్తూ

ఉంటే, 'అయ్యో! తొందరపడి రాధను నొప్పించానే' అని బాధ కలిగేది.

నేనుకూడా మురళిని చేరదీసి ముద్దు చేస్తూఉంటే రాధ నిర్లక్ష్యాన్ని పట్టించుకొనేవాడిని కానేమో! కాళ్లూ, చేతులూ ఆడిస్తూ బోసినవ్వులు కురిపించే మురళిని ముద్దులాడాలని ఉయ్యాల దగ్గిరకు వెళ్లేసరికి మురళిని స్పృశించడానికి చేతులు సమ్మెచేసేవి.

* * *

మురళిని స్కూల్లో చేర్చేము. వయస్సుకి మించిన తెలివితేటలున్న మురళి టీచర్ల అభిమానానికి పాత్రుడయ్యాడు.

ఒకరోజు మురళికి యూనిఫారం వేసి క్రాపు దువ్వుతూంది రాధ.

"అమ్మా! నాన్నగారు నాతో ఎందుకు మాట్లాడరమ్మా?" మురళి ప్రశ్నకు రాధ ఏం జవాబు చెబుతుందోనని నేను చెవులు రిక్కించేను.

"నాన్నగారి కెక్కువ పని ఉంటుంది మురళీ! అందుకే నాన్నగారికి మాట్లాడటానికి టైము ఉండదు," అంది రాధ.

"మరి పక్కింటి శ్రీకాంత్‌వాళ్ల నాన్నగారికీ పని ఉంటుంది కదా! ఎప్పుడూ శ్రీకాంత్‌తో నవ్వుతూమాట్లాడతారట." రాధ మురళి సందేహం తీర్చకుండానే "త్వరగా జోళ్లు వేసుకో, బస్సు వచ్చేస్తుంది," అని తొందర పెట్టింది.

* * *

రాత్రి భోజనాలయేక నేను గదిలో కూర్చొని పుస్తకం చదువుకుంటున్నాను.

"ఏమండీ!" చాలా రోజుల తరువాత రాధ వచ్చి మంచంమీద కూర్చుంది.

"ఏమిటి రాధా!" అన్నాను పుస్తకం మూసి.

"మురళిని అనాధబిడ్డగా భావించి జాలిపడి అయినా ప్రేమించలేరా?" అంది గద్గద స్వరంతో.

"ఎందుకలా నిష్ఠురంగా మాట్లాడతావు రాధా? నేను మురళికేం లోటుచేశాను?"

"ఏంలోటు చేస్తున్నారో మీమనస్సుకు తెలుసు. కలవారింట్లో పుట్టేడు కనుక భోగభాగ్యాలు అనుభవిస్తున్నాడు. కాని తండ్రి ప్రేమకు నోచుకోని నిర్భాగ్యుడండీ వాడు. వాడికి జ్ఞానం వస్తూంది. మీరు తనను ప్రేమించడంలేదనే అనుమానం వస్తే వాడి మనస్సు గాయపడుతుంది. ఆ బాధతో వాడు నాకు దూరమౌతాడేమోనని నా భయం," రాధ దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడవసాగింది.

"నా మనస్సును సమాధాన పర్చుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను రాధా! కనీసం మురళికి అనుమానం రాకుండా ప్రయత్నిస్తాను. సరేనా! ఊరుకో!" అంటూ రాధను ఊరడించాను కన్నీళ్లు తుడుస్తూ. రాధ నా భుజంమీద తల వాల్చి చాలాసేపు ఉండిపోయింది.

* * *



మురళిని అప్పుడప్పుడు పలకరించి స్కూలు విశేషాలు అడుగుతూ ఉండేవాడిని. మురళి బెదురుగా, ముక్తసరిగా జవాబు లిచ్చి వెళ్లిపోయేవాడు. మా మధ్య దూరం పెరిగిందే తప్ప తరగలేదు. వయస్సుతో శరీరమూ, ఆలోచనలతో, వ్యధతో మనస్సూ బలహీనమై పోయాయేమో తరచుగా చిరాకుతో కేకలుపెడుతూ ఉండేవాడిని. మురళి ఉనికిని సహించలే ననిపించేది. అందుకే వాడిని బోర్డింగు స్కూల్లో చేర్చడానికి నిశ్చయించేను. మురళి సంతోషంగా ఒప్పుకున్నాడు. రాధ మాత్రం ఇష్టపడ లేదు. చివరకు నెలకొకసారి తీసుకొని వస్తానన్న హామీ మీద అయిష్టంగానే ఒప్పుకుంది. మురళి ఋషీవేలీ స్కూల్లో చేరాడు. తీరా మురళిని దిగబెట్టి వచ్చాక ఇల్లంతా చిన్నబోయిన ట్లనిపించింది. నెలరోజులవగానే రాధ ప్రయణాని కన్నీ సిద్ధంచేసింది. ఇద్దరం కారులో వెళ్లాము. మురళిని దగ్గరకు తీసుకొని ఎన్నెన్నో అడగాలని, కబుర్లు చెప్పాలని అనుకుంటూ వెళ్లిన నేను మురళి కనబడగానే నాకు తెలియకుండానే బిగుసుకుపోయాను. తల్లీకొడుకులు కబుర్లు చెప్పుకుంటూ ఉంటే మౌనంగా చూస్తూ ఉండి

పోయాను. . ఆ వాతావరణానికి అలవాటు పడిన మురళి ఎంతో చలాకీగా కనిపించాడు.

మురళి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలోనే ఇంటరు ముగించాడు. జాయింటు ఎంట్రెన్స్ పరీక్షలో నెగ్గి ఖర్గ్‌పూరు ఐ. ఐ. టి లో చేరాడు. పెద్దవాడైనా రాధ దగ్గిర పసివాడిలాగే ప్రవర్తించే వాడు. తల్లి వెనకాలే తిరుగుతూ ఖర్గ్‌పూరు విశేషాలు, కాలేజీ చదువు, ఫ్రెండ్సు గురించి, ఇంకా ఎన్నెన్నో చెప్తూ ఉండేవాడు. వాళ్ల కబుర్లకు అంతుండేది కాదు. వాళ్ల సంభాషణలో పాల్గొనాలని, వాళ్లతో కలిసి మనసారా నవ్వాలని, మురళిని, 'నా బాబూ' అంటూ దగ్గిరకు తీసుకొని ఇన్నేళ్ల వ్యధనుండి విముక్తి పొందాలని మనస్సు ఆరాటపడేది. కాని చేతులు, నోరు సమ్మె చేసేవి. గదిగుమ్మం వరకు వెళ్లిన వాడిని మౌనంగా వెనక్కి వెళ్లిపోవలసి వచ్చేది. మురళి కాన్పూరులో ఎం.టెక్. కూడ పూర్తిచేశాడు.

* * *

"ఏమండీ! ట్రెయిన్ వచ్చే టైమవుతూంది. మీరింకా బయలుదేరలేదేం!" అంది రాధ హడావిడిగా వచ్చి.

"స్టేషనుకు వెళ్లకపోతే ఏం రాధా! మురళి పైవాడు, ఇంటికి ఊరికి కొత్తవాడు కాదుకదా! రాలేడా!"

"అబ్బ అదేం కాదండీ! స్టేషనుకు ఎవ్వరం వెళ్లకపోతే చిన్నబుచ్చుకుంటాడు. నాకు పనులు తెమలలేదు. మీరైనా వెళ్లకపోతే మన ఆరోగ్యాలు బాగా లేవేమోనని కంగారుపడిపోతాడు. వెళ్లరూ!" అంది ప్రాధేయపడుతున్నట్లు. రాధ మాటను నే నేనాడు కాదనగలిగాను!

డ్రైవరు ఆ రోజు సెలవు పెట్టడంతో నేనే కారు తీసుకొని బయలుదేరాను. క్షణక్షణానికీ నాలో దిగులు కొండలాగా పెరిగిపోతూంది. మురళి నింక రోజూ చూస్తూ నేను నరకయాతన పడవలసిందే! భగవాన్! ఇన్నేళ్లయినా నేనెందుకు సమాధాన పడలేకపోతున్నాను! నేనేం పాపంచేసేనని నాకీ రంపపుకోత! నాలో నేను కుములుతూ పరాగ్గా కారు నడుపుతున్నాను. సికింద్రాబాద్ స్టేషను సమీపంలో నా కారు లారీని ఢీకొట్టడమే నాకు తెలుసు.

* * *

కళ్లు తెరిచేసరికి ఒళ్లు, తల భారంగా ఉన్నట్లు తోచింది. అతి కష్టంమీద కళ్లు పూర్తిగా తెరిచి అది హాస్పిటల్ అని తెలుసుకున్నాను. ప్రక్కనే ఉన్న స్టూలుమీద పీక్కుపోయిన ముఖంతో రాధ కూర్చుని ఉంది.

"నాకేమైంది రాధా?" నీరసంగా అడిగేను. రాధ లేచి దగ్గిరకు వచ్చింది.

"ఏంకాలేదు. మీరు రెస్టు తీసుకోండి. తరువాత మాట్లాడదాం," అంది నా

చెయ్యి మృదువుగా నిమురుతూ. నేను క్రమంగా నిద్రలోకి జారుకున్నాను.

* * *

నాకు బాగా తెలివివచ్చి నీరసం చాలా వరకు తగ్గేక రాధ చెప్పింది. లారీకి కారు గుద్దుకొన్నప్పుడు నా తలకు దెబ్బ తగిలిందని, ట్రెయినులోంచి అప్పుడే దిగిన మురళి ఏక్సిడెంటు జరిగిన స్థలానికి వచ్చి కారును, నన్ను గుర్తించి వెంటనే హాస్పిటల్‌లో చేర్చాడనీ! అంత వరకు మామూలుగా వింటూన్న నేను రాధ చెప్పిన తరువాత విషయం విని ఉలిక్కిపడ్డాను.

"మురళి మీకు రక్తం ఇచ్చాడండీ! బ్లడ్ బ్యాంకులో మీ గ్రూపుకి సప్పిన రక్తంలేక డాక్టర్లు కంగారుపడుతుంటే మురళి రక్తమిచ్చాడు. అదృష్టవశాత్తూ గ్రూపు సప్పింది."

నేను మౌనంతోనే ప్రదర్శించిన నిరాదరణను, విముఖతను అర్థంచేసుకో లేని అమాయకుడు కాదు మురళి! అయినా నాకు రక్త మిచ్చాడంటే మురళి దెంత మంచి మనస్సు! మురళి రక్తం లోని మంచితనం నా రక్తంలో కలిసి పోయి నా మనస్సును కదల్చివేసింది. మురళిని చూసి ఎన్నో యుగాలు అయి నట్లుంది. ఇక మీదట మురళిని చూడ కుండా ఒక్క క్షణంకూడా బ్రతకలేనని పిస్తోంది.

"మురళి కనబడటం లేదేం రాధా?" అని అడిగేను.

"మురళి ఫ్రెండు పెళ్లికని బొంబాయి వెళ్లాడు," అంది.

రాధ నాలోని మార్పుని గుర్తించి నట్లు సంబరపడుతూ, "నాలుగైదు రోజుల్లో వచ్చేస్తాడు" అంది.

* * *

మురళిని చూడాలన్న ఆరాటంవల్లనో, మనస్సులోని వ్యథ పూర్తిగా దూరమై పోవడంవల్లనో నేను అనుకున్నదాని కంటె చాలా త్వరగా కోలుకొని డిస్చార్జి అయి ఇంటికి వచ్చేశాను. మురళి రాక కోసం క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్నాము.

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంట లప్పుడు డైనింగురూంలో నేను, రాధ కాఫీ త్రాగుతున్నాము. పనికుర్రాడు ఒక కవరు తెచ్చి రాధ చేతికిచ్చాడు. కవ్వు ప్రక్కనపెట్టి ఉత్తరం తీసి విప్పి చదువు తున్న రాధ అలాగే టేబిలుమీదకు ఒరిగి పోయింది. నేను కంగారుగా లేచి కుదు పుతూ, 'రాధా, రాధా?' అని పిలిచాను. పలకలేదు. వంటామె సహాయంతో రాధను బెడ్‌మీదకు చేర్చి ముఖంమీద నీళ్ల చిలకరించాను. రాధకు తెలివి వచ్చే లోపల మా ఫ్యామిలీ డాక్టరుగారికి ఫోన్ చేశాను. కొంతసేపటికి స్పృహలోకి వచ్చిన రాధ వెక్కివెక్కి ఏడవసాగింది. ఇంతలో డాక్టరుగారు వచ్చి ఇంజక్షను

ఇచ్చారు. దాని ప్రభావంతో రాధకు బాగా నిద్రపడుతుందని, లేచేసరికి మన స్సుకు ప్రశాంతత కలుగుతుందని చెప్పి వెళ్లారు. రాధ నిద్రపోయాక నాకు ఉత్తరం సంగతి గుర్తుకువచ్చింది. గబగబా వెళ్లి డైనింగు టేబిలుమీద పడివున్న ఉత్తరాన్ని తీసి చదవసాగేను. అది మురళి తల్లికి వ్రాసేడు.

'అమ్మా !

నాకోసం ఎదురుచూస్తూ ఉంటావు. కాని నేను రానమ్మా ! నీతో తొందరగా వస్తానని చెప్పినందుకు నన్ను క్షమించు. నేను త్వరలోనే అమెరికా వెళ్లిపోతున్నాను. నాన్నగారు నా కెన్నో భోగ భాగ్యాలిచ్చి నన్నింతవాడిని చేసినా నన్ను ఏనాడూ ప్రేమగా చేరదీయలేదనే కొరత ఎప్పుడూ వేధించేదమ్మా ! కారణం కోసం ఏళ్లతరబడి నేను సాగిస్తూ వచ్చిన అన్వేషణ ఏడాది క్రితమే ఫలించింది. నేను సహజంగా పుట్టలేదని, ఎంతగానో అభివృద్ధిచెందిన విజ్ఞాన శాస్త్రాన్ని ఉపయోగించి నన్నీలోకంలోకి తెచ్చారని, తన రక్తం పంచుకొని పుట్టలేదన్న బాధ నాన్నగారిని చిత్రహింసకు గురిచేస్తూ ఉందని, సమాధాన పడలేకపోవడంవల్లనే నన్ను దూరంగా ఉంచారని తెలుసుకున్నాను. ఎంతో మంచి మనస్సుతో నా పుట్టుకకు దోహదంచేసిన నాన్నగారు ఆ మంచితనంతోనే నన్ను ప్రేమించివుంటే నే నెప్పటికీ మీకు దూరం అయిఉండేవాడిని కాను. కాని తండ్రి ప్రేమకు నోచుకోని విర్భాగ్యుడిని నేను. ఏక్సిడెంటులో గాయపడి ప్రమాదంలో ఉన్నప్పుడు ఒక్క క్షణం నా కనిపించింది_ ఏనాడూ నన్ను అక్కున చేర్చుకోని వ్యక్తికోసం రక్తమెందుకు ధారపొయ్యాలని ! కాని మరు క్షణం నాలో వివేకం మేల్కొంది. ఎంతో చిత్రహింస అనుభవిస్తున్నా నన్నింతవాడిని చేసిన వ్యక్తికి కృతజ్ఞత చూపాలని అది నా ధర్మమని గుర్తించాను. మొదట క్రూరంగా ఆలోచించినందుకు సిగ్గు, పశ్చాత్తాపం కలిగాయి. రక్తం ఇచ్చాక నా మనస్సు శాంతించింది. అమ్మా! నాన్నగారికింక భయంలేదు. కాని నే నింక నాన్నగారి ఎదురుగా ఉండి ఆయన్ని రంపపుకోతకు గురిచేయలేను. అందుకే దూరంగా వెళ్తున్నాను. నా గురించి బెంగ పెట్టుకొని ఆరోగ్యం పాడుచేసుకోవద్దు అమ్మా! జీవితాల్లో ఎన్నో విచిత్ర సంఘటనలు జరుగుతూ ఉంటాయి కదమ్మా! అలాంటిదేదైనా జరిగి మనం కలుసుకుంటామేమో ! నన్ను క్షమించమ్మా ! దీవించమ్మా ! నీ మురళి.' ఉత్తరం చదవగానే మనస్సు అయోమయం అయిపోయింది. మురళి బొంబాయిలో ఎక్కడుంటున్నాడో ఎప్పుడు వెళ్తున్నాడో తెలియకపోయినా వెంటనే బొంబాయికి విమానంలో రెండు టిక్కెట్లు బుక్ చేయించేశాను. మురళి గదిలోకి వెళ్లి

అలమార్లు, పుస్తకాలు, పెట్టెలు అన్నీ గాలించగా మురళీ బయలుదేరే తేదీవున్న కాగితం దొరికింది. మురళీ రెండు రోజుల్లో వెళ్ళిపోతాడు.

రాధకు తెలివివచ్చాక హార్లిక్సు త్రాగించాను. "మనం రేపే బయదేరి బొంబాయి వెళ్ళి మురళీని కలుసుకుందాం" అని చెప్పేను. రాధ కళ్ళలోకి వెలుగు వచ్చింది.

* * *

ఎయిర్‌పోర్టులో ఆతృతగా మురళీ కోసం కళ్ళతో గాలిస్తున్న నేను మురళీ కనబడగానే పరిసరాలు మర్చిపోయి ఒక్క కేక పెట్టాను. మురళీ ఆశ్చర్యంతో దగ్గిరకు వచ్చి జాపిన నా చేతుల్లో వాలిపోయి, 'నాన్నా' అంటూ నన్ను చుట్టేశాడు. మురళీ రక్తం పంచుకొని పునర్జన్మ ఎత్తిన నేను తొలిసారిగా పుత్ర పరిష్వంగంలోని తియ్యదనాన్ని అనుభవించాను. మురళీ పిలుపు నాలోని ప్రతి అణువును పులకరింపజేసింది.

"మురళీ ! నా కిప్పుడు కావలసింది నీ కృతజ్ఞత కాదు. నీ ప్రేమ కావాలి మురళీ ! నిన్ను విడిచిపెట్టి నేను, అమ్మ బ్రతకలేం. నువ్వు మాతోనే ఉండు మురళీ !" అన్నాను, పూడుకుపోతున్న గొంతుతో. మురళీ కళ్ళు తుడుచుకున్నాడు. హఠాత్సంఘటనవల్ల కలిగిన ఆవేశాన్ని అదుపులో పెట్టుకున్నాడు.

"నాన్నగారూ ! ఇది నేను ఎన్నో వ్యయప్రయాసలుపడి సంపాదించుకొన్న అవకాశం. దీన్ని వదులుకోలేను. మూడేళ్ళు పూర్తవగానే వచ్చేసి ఇక మీ దగ్గిరే ఉండిపోతాను. నన్ను నమ్మండి," అన్నాడు. అప్పటివరకూ మౌనంగా, నిండుగా మమ్మల్ని చూస్తూ ఉండిపోయిన రాధ మురళీని దగ్గిరకు తీసుకొని, ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఉత్తరాలు తరుచుగా వ్రాయమని చెప్పింది. మురళీ వదల్లేక వదల్లేక వీడ్కోలు తీసుకొని విమానమెక్కాడు. మురళీ రాకకోసం మా నిరీక్షణ ఆ క్షణం నించే ప్రారంభమైంది.

